గ్రామాల్లోనే తాగునీటి పరీక్షలు

- శుద్ధజలాల సరఫరాకు ప్రభుత్వం నిర్ణయం
- ప్రతి గ్రామంలో క్లోరోస్కోప్ కిట్లు
- కార్యదర్శులతో నీటి నాణ్యత పరీక్షలు

మర్రిగూడ : గ్రామాల్లో ప్రజలకు శుద్ధజలాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం మిషన్ భగీరథ అధికారులతో తాగునీటి పరీక్షలు చేపట్టేలా చర్యలు తీసుకుంటోంది. మర్రిగూడ మండల వ్యాప్తంగా 20 గ్రామపంచాయతీల్లో 40 నూతన నీటి ట్యాంకులు, 22 పాత నీటి ట్యాంకులు మొత్తం 62 ట్యాంక్‌ల ద్వారా మిషన్ భగీరథ నీరు ఇంటింటికీ అందిస్తున్నారు. అయితే ఈ నీరు సురక్షితమా.. కాదా అనేది క్లోరోస్కోప్ కిట్లతో గ్రామంలోని మూడు ప్రాంతాల్లో పరీక్ష చేయాల్సి ఉంటుంది. ట్యాంకు దగ్గర 2 పీపీఎం(పార్ట్స్ ఫర్ మిలియన్), గ్రామం మధ్యలో 0.6-0.8 పీపీఎం, చివరి ఇంటి వద్ద 0.2పీపీఎం వరకు నీటి నాణ్యత లభిస్తుంది. ఈ పరీక్షల ద్వారా కలుషితమైన నీటిని గుర్తించవచ్చు.

వ్యాధుల నియంత్రణే లక్ష్యంగా..

గ్రామాల్లో ప్రజలు కలుషిత నీటిని తాగినప్పుడు పలు వ్యాధుల బారినపడే ప్రమాదం ఉంది. అలా కాకుండా ఉండేందుకు గ్రామ పంచాయతీ కార్యదర్శుల ద్వారా నీటి నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహిస్తారు. ఒకవేళ నీరు కలుషితం అయినా, నాణ్యత లోపించినా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుని శుద్ధ జలాలు సరఫరా చేయాలని అధికారులు ఆదేశించినట్లు తెలిసింది. గ్రామీణ ప్రజలకు రక్షిత మంచినీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని మిషన్ భగీరథ అధికారులు చెబుతున్నారు.



మర్రిగూడలో నీటిని పరీక్షిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వర్లు

ఏడు రకాల రిజిస్టర్లలో నమోదు..

నీటి పరీక్షల నిర్వహణ పూర్తిగా మిషన్ భగీరథ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈల ఆధ్వర్యంలో కొనసాగుతోంది. అందుకోసం నీటి సరఫరా, ట్యాంక్ క్లీనింగ్, పైపులైన్ లీకేజీ, బ్లీచింగ్ పౌడర్, క్లోరినేషన్, ట్యాంకుల పంపింగ్, ఫిర్యాదుల వివరాలను ఏడురకాల రిజిస్టర్లలో పంచాయతీ కార్యదర్శులు నమోదు చేస్తారు. గ్రామాల్లో నీటి పరీక్షలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని, ఎక్కడైనా రక్షిత మంచినీరు అందకపోయినా, కలుషిత జలాలు ఉన్నా గ్రామపంచాయతీ దృష్టికి తీసుకురావాలని అధికారులు పేర్కొంటున్నారు.

వివరాలు నమోదు చేస్తున్నాం



ప్రజలకు రక్షిత మంచినీటిని అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన నీటి పరీక్షకు సంబంధించి ఏడు రకాల రిజిస్టర్లలో వివరాలు నమోదు చేస్తున్నాం. మార్చి చివరి వారంలో నీటి పరీక్షలపై శిక్షణ ఇచ్చి క్లోరోస్కోక్ కిట్లను అందించారు. నిత్యం ఈ నీటి పరీక్షలు చేసి ప్రజలకు శుద్ధ జలాలు అందిస్తున్నాం – జొన్నలగడ్డ అక్షిత, పంచాయతీ కార్యదర్శి, పట్టిపల్లి

స్వచ్ఛమైన నీటిని అందిస్తున్నాం



గ్రామీణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేసేందుకు ప్రతి గ్రామ పంచాయతీకి క్లోరోస్కోప్ కిట్లు అందించాం. నీటి పరీక్షలను క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తున్నాం. నీటి నాణ్యత పరీక్షలు గ్రామాల్లో నిత్యం రెండుసార్లు చేయాలి. ప్రజలకు రక్షిత మంచినీటిని అందించేందుకు కృషి చేస్తున్నాం. – జిగిజార వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

శిథిల భవనాలను గుర్తించాలి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్



హాజరైన ఉద్యోగులు

నల్లగొండ టూటౌన్: నీలగిరి మున్సిపాలిటీ పరిధిలో శిథిలావస్థకు చేరిన భవనాలను వెంటనే గుర్తించాలని వార్డు ఆఫీసర్లకు మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ సూచించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో టౌన్ ప్లానింగ్, వార్డు ఆఫీసర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వార్డు ఆఫీసర్లంతా తమ వార్డుల్లో పర్యటించి శిథిలావస్థకు చేరిన భవనాలను గుర్తించి అవసరమైన వాటికి మరమ్మతులు చేయించేలా సంబంధిత ఇంటి యజమానులకు అవగాహన కల్పించాలన్నారు. కూలిపోయే దశలో ఉన్న వారిని గుర్తించి వాటిని తొలగించేందుకు మున్సిపల్ అధికారులకు వివరాలు అందించాలన్నారు. ఇలా చేయడం వల్ల ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించవచ్చని తెలిపారు. సమావేశంలో ఏసీపీ నాగిరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మూర్తుజాలీ, సురిగి శంకర్, గడ్డం శ్రీనివాస్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల సమస్యలపై పోరాడుతా



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న అశోక్‌కుమార్

నల్లగొండ టౌన్ : ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపిస్తే శాసన మండలిలో నిరుద్యోగుల, ఉద్యోగుల సమస్యలపై పోరాడుతానని నల్లగొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రుల స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి పాలకూరి అశోక్‌కుమార్ అన్నారు. బుధవారం మేకల అభినవ్ స్టేడియంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గత ప్రభుత్వం ఉద్యోగాల కల్పనలో విఫలమైందని.. కొత్తగా వచ్చిన ప్రభుత్వం ఇప్పటివరకు జాబ్ క్యాలెండర్ ప్రకటించలేదన్నారు. ఏ ఒక్క నోటిఫికేషన్ వేయలేదని, తనను గెలిపిస్తే మండలిలో నిరుద్యోగుల సమస్యలపై గళమెత్తుతానన్నారు. ఆయన వెంట పలువురు నిరుద్యోగ యువకులు ఉన్నారు.

ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

నల్లగొండ టౌన్ : వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థి బరిగెల దుర్గాప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని కోరుతు బుధవారం ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నల్లగొండలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహారాజ్, రాంబాబు, శ్రీను, నరేందర్, వెంకన్న, జగన్, శంకర్, ఎల్లయ్య, మహేశ్వరచారి, సతీష్, విజయరామరాజు, సైదాబాబు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ప్రపంచ జీవ వైవిధ్య దినోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

నల్లగొండ: ప్రపంచ జీవ వైవిధ్య దినోత్సవం సందర్భంగా బుధవారం ఎన్జీ కాలేజీ విద్యార్థులు నల్లగొండలో ర్యాలీ నిర్వహించారు. కాకతీయ డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. జీవ వైవిధ్య రంగంలో కృషి చేసిన వివిధ రంగాల వారిని సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పర్యావరణానానికి మేలు చేసే ఉత్పత్తుల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి, నన్నూరి రాంరెడ్డి, యదుల్ల అంజిరెడ్డి, సురేష్‌గుప్తా, కోఆర్డినేటర్ శ్రవణ్, నవీన్, బాల నర్సయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్స్ సంఘం ఎన్నిక

నకిరేకల్ : యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ నకిరేకల్ మండల నూతన కమిటీని బుధవారం స్థానిక చీమలగడ్డలోని చర్చిలో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బీ.ప్రేమ్‌దాస్, ముఖ్య సలహాదారుడిగా కె.వై లాజరస్, అధ్యక్షుడిగా ఎస్.ప్రభుదాస్, ఉపాధ్యక్షులుగా ఎన్.రవితేజ, ప్రధాన కార్యదర్శిగా డి.జాషువా, సంయుక్త కార్యదర్శిగా డి.సైమన్, కన్వీనర్‌గా ఎలీషా, ట్రెజరర్‌గా నాగిరెడ్డి. సహాయ ట్రెజరర్‌గా పిలిప్, సాంస్కృతిక కార్యదర్శిగా బి.క్రిష్టఫర్, మీడియా కార్యదర్శిగా జానిపాష, సభ్యులుగా యేసురత్నం ఏలీయా, జానయ్య, సామేలు, వెంకట్‌రెడ్డి ఎన్నికయ్యారు.

రైతులకు అందుబాటులో జనుము విత్తనాలు

కేతేపల్లి: రైతులకు వానాకాలం పంట సాగుకు అవసరమైన జనుము విత్తనాలను సబ్సిడీపై పంపిణీ చేసేందుకు స్థానిక సహకార సంఘం భవనంలో అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి బి.పురుషోత్తం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30 కిలోల బస్తా ధర రూ.1448 నిర్ణయించినట్లు తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఆధార్, పట్టాదారు పాసు పుస్తకాల జీరాక్స్ కాపీలను తీసుకుని ఏఈఓలను వ్యవసాయశాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ: పట్టణంలో గురువారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏడీఈ నవీద్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ లైన్‌కు అడ్డుగా ఉన్న చెట్లను తొలగిస్తున్నందున శాంతినగర్, ముశంపల్లి రోడ్డు, అశోక్ గార్డెన్స్, మారుతినగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు.

హుండీల లెక్కింపు

నకిరేకల్ : మండల పరిధిలోని నెల్లిబండ గ్రామంలో గట్టుమీద ప్రతి రెండు సంవత్సరాలకోసారి జరుగుతున్న శ్రీ లింగమంతుల స్వామి, సౌడమ్మ జాతర మంగళవారం ముగిసింది. దీంతో బుధవారం భక్తుల కానుకల హుండీని దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటలక్ష్మీ ఆధ్వర్యంలో లెక్కించారు. హుండీ ద్వారా ఆలయానికి మొత్తం రూ.201,578 ఆదాయం వచ్చింది. వీటితో పాటు హుండీలో వెండితో చేసిన మూడు కోరమీసాలు, ఆరు వెండి కళ్లు ఉన్నాయి. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ యానాల యాదగిరిరెడ్డి, డైరెక్టర్లు బాత్క లింగస్వామి, ఆడెపు సతీష్, బోయిళ్ల అశ్విన్, గుడుగుంట్ల శివశంకర్, అబ్బయ్య, ఓరుగంటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రామాలయం హుండీ ..

రామగిరి(నల్లగొండ): పట్టణంలోని రామగిరి శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయం హుండీ బుధవారం లెక్కించారు. మార్చి నుంచి హుండీ ఆదాయాన్ని లెక్కించగా రూ.1,99,728 వచ్చాయి. కార్యక్రమంలో ఆలయ ఈఓ జె.జయరామయ్య, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటలక్ష్మి, అర్చకులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

శాలిగౌరారం: మేతకోసం వెళ్లిన గేదె విద్యుదాఘాతానికి గురై మృతిచెందిన సంఘటన మండలంలోని చిత్తలూరు గ్రామంలో బుధవారం జరిగింది. వివరాలు.. గ్రామంలోని అకుల శేకర్‌కు చెందిన గేదె గ్రామ సమీపంలోని పంట పొలాల్లో మేతకు వెళ్లింది. ఈ క్రమంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేతకు వెళ్లి విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది.

సరుకులు అందజేత

నల్లగొండ టూటౌన్: నల్లగొండ పట్టణంలోని దేవరకొండ రోడ్డులో నివసించే నిరుపేద నజీర్ కుటుంబానికి న్యూకంబాల శివలీల ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు శివలీల తన సభ్యుల సహకారంతో నెల రోజులకు సరిపడా నిత్యావసర సరుకలను బుధవారం అందజేశారు. కార్యక్రమంలో పుప్పాల రేణుక, అమీర్ అలీ, లక్ష్మీబాయి, సైదులు తదితరులు పాల్గొన్నారు.

నరసింహస్వామి జయంతి



అభిషేకం చేస్తున్న అర్చకుడు

నార్కట్‌పల్లి : నరసింహస్వామి జయంతి సందర్భంగా శాపల్లి గ్రామంలో గల కమలాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం అభిషేకం, అర్చన, పూజలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక అర్చకుడు యాదగిరిగుట్ట ఆలయ విశ్రాంత ప్రధాన అర్చకుడు కారంపూడి నరసింహాచార్యులు, మాజీ సర్పంచ్‌లు సిద్దగోని స్వామి, కర్నాటి ఉపేందర్, నిమ్మనగోటి లింగయ్య, మాజీ ఉప సర్పంచ్ నిమ్మనగోటి వెంకటేశ్వర్లు, గోలి సాగర్‌రెడ్డి, ముకుందం, కర్నాటి నర్సయ్య విష్ణు, శివరామ్ పాల్గొన్నారు.

25న బొడ్రాయి వార్షికోత్సవం

మర్రిగూడ : మండలంలోని మేటిచందాపురం పరిధిలోగల ఇందుర్తి గ్రామ బొడ్రాయి ప్రథమ వార్షిక మహోత్సవం ఈ నెల 25న నిర్వహించనున్నట్లు మాజీ సర్పంచ్ జంగిలి లక్ష్మీప్రసన్నరవి బుధవారం తెలిపారు. భక్తులు, అధిక సంఖ్యలో హాజరై వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బాధితులకు ఆర్థికసాయం

చిట్యాల: మండలంలోని గుండ్రాంపల్లి గ్రామానికి చెందిన పానుగల్ల వెంకటేశం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను ఆదుకునేందుకు ఆ గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్‌లో అతడితో కలిసి చదువుకున్న 1985-86 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు ముందుకు వచ్చారు. వీరిలో వెంకటేశం స్నేహితుడు కోయగూర శ్రీనివాస్(సన్ని) లక్ష రూపాయలు అందించగా, మిగతా స్నేహితులంతా కలిసి రూ.65 వేలు సేకరించి బుధవారం బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. అదేవిధంగా వెలిమినేడు గ్రామానికి చెందిన బుట్టి సత్తమ్మ బుధవారం అనారోగ్యంతో మృతి చెందింది. మృతదేహాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు అంతటి పారిజాత సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించి మృతురాలి కుటుంబానికి ఐదు వేల రూపాయల ఆర్థికసాయం అందించారు.

గీతకార్మికుడి కుటుంబానికి ..

మునుగోడు: మండలంలోని ఊకొండి గ్రామానికి చెందిన గీతకార్మికుడు నకరకంటి అంజయ్య మంగళవారం తాటి చెట్టుపై నుంచి జారిపడి మృతి చెందాడు. అంజయ్య అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం భువనగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ పంపిన రూ. 10వేలను బుధవారం గౌడ సంఘం నాయకులు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బొడ్డు నాగరాజు గౌడ్, బోయపల్లి రవి, మారెడ్డి వెంకట్‌రెడ్డి, బొమ్మగోని అనిల్ , భీమగోని చంద్రమోహన్, దశరథ తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుడి కుటుంబానికి..

మునుగోడు మండల కేంద్రానికి చెందిన చేనేత కార్మికుడు జేళ్ల శ్రీను అనారోగ్యంతో మృతి చెందగా ఆయన అంత్యక్రియల నిమిత్తం బుధవారం కాంగ్రెస్ పార్టీ మునుగోడు పట్టణ అధ్యక్షుడు ఆరేళ్ల సైదులు ఆర్థికసాయం అందజేశారు. మిర్యాల వెంకన్న పందుల సంపత్, రావిరాల కుమారస్వామి, దొమ్మాటి లింగస్వామి, సైదులు, గిరి, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని వినతి

నల్లగొండ: ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని కోరుతూ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంపల్లి భిక్షపతి బుధవారం హైదరాబాద్‌లో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణను కలిసి వినతి పత్రం అందజేశారు. పీఆర్సీ, ఏరియర్స్, డీఏ ఏరియర్స్, జీపీఎఫ్, సీసీఎస్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు. ఆయన వెంట మేడే రామకృష్ణ, ఉదావత్ లచ్చిరాం, పాల్వాయి వెంకటయ్య, దున్న నగేష్‌లు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

మర్రిగూడ: మండల పరిధిలోని యరగండ్లపల్లి గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శ్రీకంఠమహేశ్వరసురమాంబ ఆలయానికి గ్రామస్తుడు వల్లంల సంతోష్‌యాదవ్ రూ.55వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో ముద్దం శ్రీను గౌడ్, జమ్ముల వెంకటేష్‌గౌడ్, ఐతగోని రాములుగౌడ్‌లు పాల్గొన్నారు.

దివ్యాంగుల ఓట్లు కాంగ్రెస్ పార్టీకే..



సమావేశంలో మాట్లాడుతున్న వీరయ్య

నల్లగొండ: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఉన్న 12 వేల దివ్యాంగుల పట్టభద్రుల ఓట్లు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకేనని వికలాంగుల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విభాగం రాష్ట్ర చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో జరిగిన జిల్లా దివ్యాంగుల పట్టభద్రుల ముఖ్య కార్యకర్తల సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో దివ్యాంగులకు బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయలేదని విమర్శించారు. సమావేశంలో నల్లగొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు షేక్ లతీఫ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పల్సా రవి, కొత్త వెంకన్న యాదవ్, సీహెచ్ మత్స్యగిరి, వి.ముత్తయ్య, డి.శంకర్, ఎం.నాగరాజు, మాధవరెడ్డి, మధు, డి.సైదులు, సైదిరెడ్డి, బుచ్చి రాములు, ఎం.నగేష్ పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నను గెలిపించాలని ప్రచారం

నకిరేకల్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని కోరుతూ నకిరేకల్‌లోని నారాయణ స్కూల్, వాసవి కళాశాలలోని స్టడీ హాల్‌లో బుధవారం ఎన్ఎస్‌యూఐ నాయకులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజన్ కుమార్‌యాదవ్, ఎన్నికల ఇన్‌చార్జ్ మహమ్మద్ షాదుల్లా, పన్నాల రాఘవరెడ్డి, లింగాల వెంకన్న, వేమవరపు ప్రవీణ్ పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు



కొంపల్లి చెరువులో మట్టి తవ్విన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మునుగోడు: ఉద్యోగులు విధుల పట్ల అంకితభావంతో పనిచేయాలని, ఎవరైనా అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని చిన్న నీటిపారుదల శాఖ చౌటుప్పల్ డివిజన్ ఈఈ మనోహర్ హెచ్చరించారు. మునుగోడు మండలంలోని వివిధ గ్రామాల్లో చెరువులు, కుంటల్లో కొందరు అక్రమంగా మట్టిని తరలిస్తుండడంతో గత మంగళవారం సాక్షి దినపత్రిలో అనుమతుల్లేకుండానే మట్టి తరలింపు అనే కథనం ప్రచురితమైంది. కథనానికి ఆయన స్పందించి బుధవారం మండలంలోని కొంపల్లి గ్రామ చెరువును పరిశీలించారు. ఆ చెరువులో దాదాపు 20 నుంచి 30 అడుగుల లోతు జేసీబీలతో మట్టిని తవ్వి తరలించడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. వెంటనే ఆ మట్టిని తరలించినవారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకునేలా స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలని మునుగోడు డివిజన్ డీఈ ప్రేమ్‌కుమార్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఇది ఇలాఉండగా తాను చెరువుల పరిశీలనకు వస్తున్న విషయం తెలిసి కూడా విధులకు గైర్హాజరైన జేఈ సిద్ధార్థకు మెమో జారీ జారీచేస్తానని ఈఈ తెలిపారు. ఉన్నతాధికారులు వచ్చిన సమయంలో విధులకు రాకుంటే ఇక సాధారణ రోజుల్లో విధులు ఎలా నిర్వహిస్తారని మండిపడ్డారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది, కొంపల్లి గ్రామ మత్స్యకార్మికులు తదితరులు ఉన్నారు.

దోమల నియంత్రణకు చర్యలు

నల్లగొండ టూటౌన్: వర్షాలు కురిసి లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలుస్తుండడంతో నీలగిరి మున్సిపల్ సిబ్బంది దోమల నియంత్రణకు చర్యలు చేపడుతున్నారు. పట్టణంలోని వివిధ కాలనీల్లో మురుగునీటి ప్రాంతాలను గుర్తించి బుధవారం ఆయిల్ బాల్స్ వేయడంతో పాటు దోమల మందు వెదజల్లారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురిగి శంకర్ మాట్లాడుతూ దోమల నివారణకు పట్టణ ప్రజలు ఖాళీ కొబ్బరి బోండాలు, ఇంట్లో కూలర్లు, పూల కుండీలు శుభ్రపరుచుకోవాలన్నారు.

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

మర్రిగూడ: ఖమ్మం-వరంగల్-నల్లగొండ నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల అధికారి, తహసీల్దార్ బక్క శ్రీనివాసులు తెలిపారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీలు-467, పురుషులు-911 మొత్తం 1384 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారన్నారు.

నేడు మంత్రి కోమటిరెడ్డి పుట్టినరోజు వేడుకలు

- అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలి
- కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి

నల్లగొండ: రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను గురువారం నల్లగొండలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించనున్నట్లు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకల సందర్భంగా ఉదయం 9.30 గంటలకు క్యాంపు కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళా కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కోమటిరెడ్డి అభిమానులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

హెచ్ఎంలకు పుస్తకాలు అందజేత

కట్టంగూర్ : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల 2024-25 విద్యా సంవత్సరానికి గాను ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలను కట్టంగూర్ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ మేక నాగయ్య హెచ్ఎంలకు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు అంబటి అంజయ్య, ఆలకుంట్ల వెంకటేశ్వర్లు, సీఆర్పీలు రవికుమార్‌గౌడ్, సత్యనారాయణ, లింగస్వామి పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నకిరేకల్ : లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని తాటికల్‌లోని లయన్స్ క్లబ్ వృద్ధాశ్రమంలో బుధవారం క్లబ్ జిల్లా ప్రతినిధి డాక్టర్ యానాల మోహన్‌రెడ్డి, కందాల పాపిరెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా బిచెనేపల్లి ప్రకాష్‌రావు, ప్రధాన కార్యదర్శిగా ఆడెపు కృష్ణమూర్తి, కోశాధికారిగా శివకోటి ఆంజనేయులు, ఉపాధ్యక్షులుగా రేపాల సతీష్, దుస్స సత్యనారాయణ, సహాయ కార్యదర్శిగా ఎస్.చంద్రరావు ఎన్నికయ్యారు. వెంకటరమణ, అశోక్, బొల్లం కృష్ణమూర్తి, ఎస్.రాంమోహన్‌రావు, ప్రభాకర్‌రావు, యాదగిరిరెడ్డి, శంభులింగారెడ్డి, సూర్యకుమార్, దైద రవీందర్, పోతుల మల్లయ్య, నూనె వాసు, పెండెం సదానందం పాల్గొన్నారు.

- వర్షం వస్తే గుంతల్లో నిలుస్తున్న నీళ్లు
- పూర్తిగా కొట్టుకుపోయిన బీటీ

అధ్వానంగా మాండ్ర రోడ్డు



గుంతల్లో నుంచి ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారుడు



బీటీ పూర్తిగా కొట్టుకుపోయి మట్టి తేలిన రోడ్డు

నార్కట్‌పల్లి : మండల కేంద్రం నుంచి మాండ్ర గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయి మట్టి తేలింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతూ ఆ రోడ్డుపైనే ప్రయాణిస్తున్నారు. అధ్వానంగా ఉన్న రోడ్డు పైనుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు నిత్యం ప్రయాణిస్తున్నప్పటికీ పట్టించుకోవడంలేదు. ఐదేళ్లుగా సమస్యను పరిష్కరించకపోవడంతో బీటీ రోడ్డు పూర్తిగా గుంతలుగా మారి మట్టి రోడ్డును తలపిస్తోంది.

ఆటోలను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు

మండల కేంద్రమైన నార్కట్‌పల్లికి మాండ్ర గ్రామం 6 కిలోమీటర్ల దూరం ఉంటుంది. వర్షం వస్తే రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో నీరు నిల్వ ఉండడంతో ద్విచక్ర వాహనదారులు ప్రయాణించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు మండల కేంద్రానికి రావడానికి ఆటోలను ఆశ్రయిస్తున్నారు. గతంలో గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉండేది. రోడ్డు బాగా లేకపోవడంతో ప్రస్తుతం బస్సు సర్వీసును రద్దు చేశారు. దీంతో విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చేసేది లేక ఆటోల్లో ప్రయాణిస్తున్నారు. రోడ్డు సక్రమంగా లేకపోవడంతో ఆటోల్లో ప్రయాణించడానికి వృద్ధులు తంటాలు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డును అభివృద్ధి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



మాండ్ర గ్రామం నుంచి నార్కట్‌పల్లికి 6 కిలోమీటర్ల దూరం ఉంటుంది. మాండ్ర ప్రజలు ప్రతి పనికి మండల కేంద్రానికి వెళ్లాల్సి ఉంటుంది. రోడ్డు పూర్తిగా పాడైపోయినప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. రోడ్డుకు మరమ్మతులు చేసి సమస్యను పరిష్కరించాలి. –తరాల శ్రీనివాస్, మాండ్ర గ్రామం

అధికారులకు తెలియజేశాం



రోడ్డు అధ్వానంగా మారి ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గతంలోనే అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదు. త్వరలో మరమ్మతులు చేయిస్తామని చెప్పి తర్వాత పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి. –దొండ సౌమ్య, మాజీ సర్పంచ్ మాండ్ర